నమస్తే తెలంగాణ



బాల్కొండలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు



ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

# ప్రభుత్వం ఆదుకోవాలి

- మహాలక్ష్మి పథకం అమలుతో రోడ్డున పడ్డాం
- ఆటోల్లో మహిళలు ఎక్కడం లేదు
- ఆటో డ్రైవర్ల ఆందోళన

బాల్కొండ, డిసెంబర్ 15 : మండల పరిధిలోని అన్ని గ్రామాల ఆటో యూనియన్ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల స్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఆటోలతో తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలు తగ్గాయని అన్నారు. తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఆటోలను నమ్ముకుని జీవిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఆర్మూర్‌లో ఆటో డ్రైవర్ల ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్15: పట్టణంలో ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, తెలంగాణ రాష్ట్ర ఆటో ప్యాసింజర్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. మహిళలకు ప్రభుత్వం ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఆటోలు ఎక్కడం లేదని వారు అన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలన్నారు. అనంతరం ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## ధర్పల్లిలో..

ధర్పల్లి,డిసెంబర్15:మండల కేంద్రంలో ఆటోవాలాలు నిరసన తెలిపారు. మహాలక్ష్మీ పథకంతో ఆటో నడుపుకొని బతికే తాము రోడ్డున పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

### కుటుంబ పోషణ భారంగా మారింది



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మాకు లబ్ధి చేకూరుతుందనుకున్నాము. కానీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. మహిళా ప్రయాణికులు ఆటోలు ఎక్కడం లేదు. గిరాకీలు తగ్గాయి. కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.

**- ముఖీం, ఆటోడ్రైవర్, బాల్కొండ**

### ఆటోలు ఎక్కడం లేదు



మేము బాల్కొండ నుంచి ఆర్మూర్, నిర్మల్, పోచంపాడ్ తదితర ప్రాంతాలకు రోజూ ఆటోలు నడుపుతాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు ఆటో నడుపుతూ నేను రోజుకు రూ.300 సంపాదించే వాడిని. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. అప్పటి నుంచి ఆటోల్లో మహిళలు ఎక్కడం లేదు.

**- ఇస్మాయిల్, ఆటోడ్రైవర్, బాల్కొండ**

## అధికారులు అందుబాటులో ఉండాలి



సమావేశంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, అధికారులు

ఏర్గట్ల, డిసెంబర్15: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్ అధికారులతో మాట్లాడారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసల్దార్ యూసుఫ్, ఎంపీడీవో కర్నె రాజేశ్, మండల వ్యవసాయధికారి అబ్దుల్ మాలిక్, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు జక్కని మధుసూదన్, మండల కో–ఆప్షన్ మెంబర్ అష్రాఫ్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలు అభినందనీయం



దుప్పట్లను పంపిణీ చేస్తున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్

బోధన్, డిసెంబర్ 15: నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛందంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని బోధన్ ఏసీపీ కేఎం కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆచన్‌పల్లిలో చర్చి ఏర్పాటు చేసి 60 ఏండ్లు పూర్తయిన సందర్భంగా, క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని హ్యూమన్ రైట్స్ కమిటీ జిల్లా చైర్మన్ డి.జ్యోతిరాజ్, కుటుంబీకుల సహకారంతో సుమారు 55 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ ముల్కల ప్రభాకర్, ఎడ్వర్ట్ ముల్లర్, కిశోర్, సుదీప్, రవికుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యోగ భద్రత కల్పించాలి'

నందిపేట్, డిసెంబర్ 15: మండలంలోని జీపీ సిబ్బంది, కారోబార్లు రాష్ట్రపంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రతతోపాటు సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. కారోబార్లను బిల్ కలెక్టర్లు, కార్యదర్శులుగా నియమించాలని, ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరారు. కారోబార్ల సంఘం అధ్యక్షుడు నంబూద్రి ప్రసాద్, ఉపాధ్యక్షులు నర్సయ్య, సుధాకర్ తదితరులు ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నందిపేట్ కారోబార్లు

## ఢాకా లయన్స్ ఇంటర్నేషనల్ సదస్సుకు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్

బోధన్, డిసెంబర్ 15: లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో శనివారం నుంచి నాలుగురోజుల పాటు జరిగే 'ఇండియా సౌత్ మిడిల్ ఏసియా (ఇసామీ) సదస్సులో బోధన్‌కు చెందిన లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ బసవేశ్వరరావు పాల్గొననున్నారు. ఆమె శుక్రవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి తన భర్త లయన్స్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బసవేశ్వరరావుతో కలిసి ఢాకాకు బయలుదేరారు. ఈ ఇసామీ సదస్సులో లయన్స్ సభ్యత్వానికి సంబంధించి ఆమె అవార్డును కూడా అందుకోనున్నారు. ఇసామీ సదస్సులో లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, ఇంటర్నేషనల్ డైరెక్టర్స్‌తో పాటు 18 దేశాలకు చెందిన లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు పాల్గొంటారు.



**మెండోరా మండలంలోని పోచంపాడ్ జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థుల స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతుల్లో పాఠాలు బోధించారు. - మెండోరా, డిసెంబర్ 15**

## కేజీబీవీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసచారి

మాక్లూర్, డిసెంబర్ 15: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాసాచారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థినుల హాజరు శాతం, 10వ తరగతి, ఇంటర్ పరీక్షల సన్నద్ధతపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి చదవడం, రాయడం వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలలో వండిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. రాష్ట్ర పరిశీలకుల బృందంలో వనిత, ఏఎంవో రామరావు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్15: పట్టణంలో 24వ వార్డుకు చెందిన కాసు వంశీకి మంజూరైన రూ.48వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆకుల రాము శుక్రవారం లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బోధన్ రూరల్, డిసెంబర్15: విద్యార్థుల కోసం స్పెషల్ బస్సులు నడిపించాలని కోరుతూ సాలూరా మండల కేంద్రంలో శుక్రవారం విద్యార్థులు ఆందోళన చేశారు. సాలూర నుంచి బోధన్‌కు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బోధన్ రూరల్ పోలీసులు విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

## గుత్పలో పశు వైద్య శిబిరం

మాక్లూర్, డిసెంబర్ 15: మండలంలోని గుత్ప గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ– నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ, కృత్రిమ గర్భధారణ శిబిరం శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. వైద్యులు ఉమామసాహెర్ మాట్లాడుతూ 13 దూడలకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశామని తెలిపారు. 4 దూడలకు కృత్రిమ గర్భధారణ, 27 పశువులకు సాధారణ చికిత్సలు చేశామని, 31 పశువులకు నట్టల నివారణ మందులను వేశామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట చిన్నయ్య, పశు వైద్యసిబ్బంది, గోపాలమిత్ర పాల్గొన్నారు.

## వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్15: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నాయకుడు జెస్సు అనిల్ మాట్లాడుతూ వల్లభాయ్ పటేల్ దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వార్డెన్లు సమయపాలన పాటించాలి

శక్కర్‌నగర్, డిసెంబర్ 15: బోధన్ పట్టణంలోని పలు ప్రభుత్వ వసతిగృహాల్లో సంక్షేమాధికారులు సమయపాలన పాటించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే ఆరోపించారు. శుక్రవారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరుకులు బయటికి వెళ్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో ఆసంఘం డివిజన్ అధ్యక్షుడు మంగేశ్, ఉపాధ్యక్షుడు దత్తాద్రి, స్రవంతి, సాయి, కార్యదర్శులు మమత, లత, చందు తదితరులు పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

రెంజల్, డిసెంబర్ 15: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల్లో చైతన్య పరిచే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం గ్రామస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర ఈనెల 16 నుంచి 28 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎంపీపీ లోలపు రజిని, జడ్పీటీసీ మేక విజయ, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, ఇన్‌చార్జి ఏపీఎం భాస్కర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.